క్లుప్తంగా

కుల గణన తర్వాతే వర్గీకరణ చేపట్టాలి



మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): కుల గణన జరిగిన తరువాతే ఎస్సీ వర్గీకరణకు చర్యలు చేపట్టాలని దళిత సంక్షేమ సేవా సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్సీలకు క్రీమిలేయర్‌ను అమలు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్సీల సంక్షేమానికి ప్రభుత్వం అందించే రాయితీలు కిందిస్థాయి వరకు చేరడం లేదన్నారు. దీంతో ఎస్సీల అభివృద్ధి నెరవేరడం లేదని వాపోయారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా అధ్యక్షుడు శివాజీ, గోపాలయ్య గోపీనాథ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీరప్పచెరువులో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని బీరప్పచెరువులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఎగువ వెంకటాపురంలో..

తవణంపల్లె: మండలంలోని ఎగువ తడకరలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తామని తవణంపల్లె మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉచిత వైద్య సేవలను పొందాలని కోరారు.

వామ్మో.. కల్తీ మిరియాలు !


కల్తీకి వాడుతున్న నెమిలిఊడగ గింజలు

చౌడేపల్లె: ఘుమఘుమలాడే వంటల కోసం వినియోగించే మిరియాలను కొని కొనుగోలు చేస్తే మోసపోవడం ఖాయం. సాధారణంగా కిలో మిరియాల ధర రూ.700 నుంచి రూ.800 ధర ఉంటుంది. వ్యాపారులు మిరియాల్లోకి అటవీప్రాంతంలో పండే నెమలి ఊడగ గింజలు అచ్చం మిరియాల్లాగే ఉంటాయి. వాటిని గిరిజనుల నుంచి కిలో వంద చొప్పున కొనుగోలు చేసి ఎండబెట్టి మిరియాల్లో కల్తీ చేసి దర్జాగా విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

వైభవంగా ఉబ్బదేవర్లు

పుంగనూరు: పట్టణంలోని రజకులు ఉబ్బదేవర్ల పూజలను వైభవంగా జరిపారు. అమ్మవారిని పట్టణంలో ఊరేగింపు నిర్వహించి గంగమ్మ, వీరభద్రస్వామికి పూజలు చేసి, బలులు సమర్పించారు. ఈ సందర్భంగా విందు భోజనాలతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో వేడుకలు జరుపుకున్నారు.

చిత్తూరు మండలంలోని ఓ పంచాయతీలో కూటమి నేతల స్వార్థరాజకీయం నడుస్తోంది. దీని అదునుగా భావించి కూటమి నేతలు కొందరు కార్యకర్తలను రెచ్చగొట్టారు. సర్పంచ్‌ను పంచాయతీలో జరిగే సభలకు అనుమతించకూడదని కంకణం కట్టుకున్నారు. అడ్డుకోవాలని గట్టిగా కార్యకర్తలకు నూరిపోశాడు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఆ సభకు వచ్చిన సర్పంచ్‌ను కూటమి నేతలు సభకు వెళ్లకుండా అడ్డుకున్నారు. చివరకు పంచాయతీ కార్యదర్శి ఆ సర్పంచ్‌ను సభకు తీసుకెళ్లేందుకు గట్టిగా ప్రయత్నించారు. తీరా విషయం పోలీసుల చెవిలో పడడంతో కూటమి నేత, అతని అనుచరులు మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు.



పల్లె పాలన నిర్వీర్యం

పల్లెల్లో కూటమి పంజా విసురుతోంది. పల్లె పాలనను నిర్వీర్యం చేస్తోంది. సర్పంచుల వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. పల్లెపాలకుల పవర్‌ను కట్ చేస్తోంది. పనులు దక్కకుండా చేస్తోంది. ప్రొటోకాల్‌ను పక్కదారి పట్టిస్తోంది. కూటమి శ్రేణులకు పట్టం కడుతోంది. దీంతో కూటమి నేతలు, కార్యకర్తలు పల్లెల్లో అంతా తామై వ్యవహరిస్తున్నారు అధికారులు సైతం అధికారానికి తలొగ్గి సర్పంచులను అగౌరవ పరుస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

- పంచాయతీలపై కూటమి పంజా
- గాడి తప్పిన సర్పంచుల వ్యవస్థ
- సర్పంచుల పవర్‌కట్
- పనుల్లో చోటు లేని వైనం
- కూటమి నేతలకే పల్లెల్లో పట్టం
- వెల్లువెత్తుతున్న విమర్శలు

కాణిపాకం: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో మొత్తం 197 పంచాయతీలుండగా 196 మంది సర్పంచులున్నారు. సర్పంచ్‌గా ఎన్నికైన వ్యక్తి ఐదేళ్ల పాటు పంచాయతీలో కీలకంగా వ్యవహరిస్తారు. గ్రామ పాలన మొత్తం సర్పంచ్ చేతిలోనే జరుగుతుంది. చట్టం, ప్రభుత్వ నిబంధనల ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుని సర్పంచ్ తన విధులు నిర్వహిస్తారు. రోజువారీ పనుల నిమిత్తం ప్రభుత్వ ఆమోదం మేరకు డబ్బు ఖర్చు చేసే అధికారం సర్పంచులకు ఉంటుంది. ఈ మేరకు చేసిన వ్యయాలకు తదుపరి పంచాయతీ సమావేశంలో ఆమోదం పొందాలి. ఈ విషయంలో గ్రామపంచాయతీ తీర్మానాలకు లోబడే సర్పంచ్ పనిచేయాలి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో సర్పంచుల బాధ్యతలను పక్కన పెట్టి టీడీపీ నాయకులు, కార్యకర్తలే పంచాయతీల్లో పెత్తనం చలాయిస్తున్నారు.

కూటమి శ్రేణులదే పెత్తనం

కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలే అన్నింటా తామై దూసుకుపోతున్నారు. అధికారం తమదే అంటూ సర్పంచులను పక్కన పెట్టి పెత్తనం చలాయిస్తున్నారు. పంచాయతీల్లో చిన్న చిన్న మరమ్మతుల నుంచి పెద్ద పెద్ద పనుల వరకు కూటమి శ్రేణులే నడిపిస్తున్నాయి. సర్పంచుల ఖాతాలో కూడా చేయి పెట్టాలని చూస్తున్నారు. అభివృద్ధి పనులను వారే కైవసం చేసుకుంటున్నారు. సర్పంచులకు కనీస సమాచారం లేకుండా రోడ్ల నిర్మాణం, ఇతరత్రా పనులు చేసుకుంటున్నారు. ప్రతి పనికి కచ్చితంగా సర్పంచ్ ఆమోదం ఉండాలి. అయితే సర్పంచ్ ఆమోదం లేకుండానే దర్జాగా పనులు జరిపిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు సైతం సర్పంచ్ తీర్మానం లేకుండానే నిర్వహిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ప్రభుత్వం సర్పంచుల సంతకాలతో పని లేకుండా వర్కులు చేసుకునేలా జీఓ ఇచ్చిందని చెబుతున్నారు. ప్రస్తుతం చిత్తూరు, పూతలపట్టు నియోజవర్గాల్లో 297 పనులకు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులంతా కూటమి నేతలు, కార్యకర్తలే పంచుకున్నారు. సర్పంచుల అనుమతి లేకుండా ఇష్టానుసారంగా పనులు చేయిస్తున్నారు. మండల స్థాయి, పంచాయతీ అధికారులు కూడా సర్పంచులను గాలి కొదిలేశారు. దీంతో పంచాయతీ పాలన భ్రష్టు పట్టి సర్పంచ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతోంది.

కానరాని ప్రొటోకాల్

పంచాయతీ పాలన మొత్తం సర్పంచ్ చేతుల మీదుగానే జరగాలనే నిబంధన ఉంది. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా జరుగుతోంది. చాలా చోట్ల పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధి పనులు, సభలు, సమావేశాలకు ఆహ్వానించడం లేదు. కూటమి నేతలతోనే వాటిని జరిపిస్తున్నారు. ముందస్తుగానే పంచాయతీ కార్యదర్శులకు సభలు, సమావేశాలకు సర్పంచ్‌లను పిలవద్దని హుకుం జారీ చేస్తున్నారు. వారు కూడా కూటమి పోరు పడలేక సర్పంచ్‌లను దూరం చేయాల్సి వస్తోంది. లేకుంటే మండల అధికారుల నుంచి పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తెప్పిస్తున్నారు. మండల నాయకుల నుంచి బెదిరింపులకు గురి చేస్తున్నారు. దీంతో చాలా చోట్ల పంచాయతీ కార్యదర్శులు వారికి తలొగ్గి పనిచేయాల్సి వస్తోంది. కొన్నిచోట్ల శిలాఫలకాల్లో సైతం సర్పంచ్‌ల పేరు వేయడం లేదు. ఇలాగే కొనసాగితే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని కొంత మంది సర్పంచ్‌లు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

నియోజకవర్గం	మండలం	పంచాయతీలు
చిత్తూరు	చిత్తూరు	17
	గుడిపాల	26
పూతలపట్టు	పూతలపట్టు	26
	బంగారుపాళ్యం	41
	తవణంపల్లి	32
	ఐరాల	28
	యాదమరి	26

సర్పంచులంటే కీలు బొమ్మలా....



ఏ ప్రోగ్రాం జరిగిన ముందు సర్పంచులకు పిలుపు ఉండేది. చిన్న పని కూడా సర్పంచ్ చేతుల మీదుగానే జరిగేది. ఉపాధి హామీ ద్వారా జరిగే పనులకు కూడా సర్పంచ్ తీర్మానం కచ్చితంగా తీసుకునేవారు. ఈ గవర్నమెంట్ వచ్చిన తర్వాత మమ్మల్ని కీలు బొమ్మలనుకుంటున్నారు. వారి ఇష్టానుసారంగా పనులు చేసుకుంటున్నారు. సభలు, సమావేశాలకు ప్రొటోకాల్ పాటించడం లేదు. సర్పంచ్‌ల చట్టాన్ని ఉల్లంఘిస్తే ఊరుకోం.

–హంస, సర్పంచ్, పచ్చనపల్లి, చిత్తూరు మండలం

ప్రాధాన్యత లేదు



కూటమి ప్రభుత్వం వచ్చాక సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కూటమి శ్రేణులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారు. సభ, సమావేశాల్లో కనీస మర్యాదలు లేవు. కూటమి నేతలకే పట్టం కట్టి మమ్మల్ని దూరం పెడుతున్నారు. పనులు ఇవ్వడం లేదు. అన్నింటా వారే తలదూర్చుతున్నారు. ప్రజాస్వామ బద్ధంగా ఎన్నుకున్న సర్పంచులకు ఈ దుస్థితి ఏంటి? గ్రామ స్వరాజ్యాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీరం చేస్తోంది.

–రాధిక, సర్పంచ్, తొడతర, తవణంపల్లి

సాహితీ పురస్కారానికి రచనలు ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కార పోటీకి రచనలు ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షురాలు రోజాప్రియ తెలిపారు. కథల సంపుటి, నవలలు, చందోపద్య కవిత్వం , వచన కవిత్వంను 2024లో ముద్రితమైన పుస్తకాలను మాత్రమే పంపాలన్నారు. ఉత్తమ రచనకు రూ.10 వేల నగదు బహుమతి ఉంటుందన్నారు. శ్రీరామనవమి రోజు ఈ సాహితీ పురస్కారం అందిస్తామన్నారు. రచయితలు, కవులు వారి రచనలను మూడు పుస్తకాలుగా కె.రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్ హోమ్, సుందరయ్యవీధి, చిత్తూరు అనే చిరునామాకు పంపాలని ఆమె పేర్కొన్నారు.

సీపీఐ నేతల నిరసన


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కేంద్రమంత్రి అమిత్ షా గో బ్యాక్ అంటూ సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ మాట్లాడారు. ఇటీవల పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానపరిచిన అమిత్ షా రాష్ట్రానికి రావడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని రచించి దశ, దిశ నిర్దేశించిన అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రిగా ఉన్న అమిత్‌షా తక్కువ చేసి మాట్లాడడం సరికాదన్నారు. ఈ మేరకు వామపక్ష పార్టీల రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు చిత్తూరులో నిరసన వ్యక్తం చేశామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత పశు వైద్య శిబిరాలు

ఐరాల: మండలంలో సోమవారం నుంచి 30వ తేదీ వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశుసంవర్థక శాఖ ఏడీ పద్మావతి తెలిపారు. మండలంలో మూడు విభాగాలుగా పశువైద్య సిబ్బంది గ్రామాలకు వెళ్లి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మూడో విభాగం సిబ్బంది నాగంవాండ్లపల్లె, రెండో విభాగం ఈడిగపల్లె, 21న మొదటి విభాగం వేదగిరివారిపల్లె, గొల్లపల్లె(పొలకల) రెండో విభాగం పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 22న మొదటి విభాగం మల్లారపల్లె, చిన్నస్వామిరెడ్డిపల్లెలో రెండో విభాగం, నెల్లిమందపల్లెలో మూడో విభాగం, 23న నాంపల్లెలో మొదటి విభాగం, భీమనేనివారిపల్లెలో రెండో విభాగం, 24న ఇరువారంపల్లెలో మొదటి విభాగం , పెద్దగొల్లపల్లె, మొరంపల్లె గ్రామాల్లో మూడో విభాగం సిబ్బంది పశువైద్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. 25న పీ.యర్లంపల్లెలో మొదటి విభాగం, పుల్లూరులో రెండో విభాగం, కమ్మతంపల్లెలో మూడో విభాగం, 26న కురప్పపల్లె మొదటి విభాగం, ముదిగోళంలో రెండో విభాగం, 27న మోటకాంపల్లె, ఎగువచవటపల్లె గ్రామాల్లో మొదటి విభాగం, దివిటివారిపల్లెలో మూడో విభాగం శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. 28న మొదటి విభాగం సిబ్బంది మిట్టూరులో, రెండో విభాగం పుత్రమద్ది, 29న 45 కొత్తపల్లె మాదిగవాడ, చిగరపల్లెలో రెండో విభాగం, కామినాయనపల్లెలో మొదటి విభాగంవారు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 30న వడ్రాంపల్లె, చిన్నకాంపల్లె, 31న అగరంపల్లెలో, బొమ్మసముద్రంలో శిబిరాలు నిర్వహిస్తారని వివరించారు. ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

గుడిపాల: మండలంలో నేటి నుంచి పశువైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారులు సాయిసుధ, రవితేజ తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాడిపశువుల్లో పిడుదుల నివారణ, గర్భకోశవ్యాధి చికిత్స, లంపీస్కిన్‌తో పాటు అన్నిరకాల రోగాలకు చికిత్స అందించేందుకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 20వ తేదీన చుక్కావారిపల్లె, బొమ్మసముద్రం, 21న వెప్పాలమానుచేను, గొల్లమడుగు, 22న దళవాపల్లె, చింతగుంటూరు, 23న తిమ్మయ్యపల్లె, పానాటూరు, 24న వెంగమాంబపురం, మరకాలకుప్పం, 25న సీఎం కొత్తయిండ్లు, డీబీపల్లె, 27న తుమ్మలవారిపల్లె మొరవ, చిత్తపార, 28న రామాపురం, బండపల్లె, 29న నారగల్లు, చీలాపల్లె, 30న బసవాపల్లె, పేయనపల్లె, 31న బుచ్చన్నకండిగ, మొగరాళ్లపల్లెలో పశువైద్యశిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్


గుడిపాల: రాష్ట్రప్రభుత్వం రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆదివారం గుడిపాల మండల పరిధిలో చిత్తూరు-వేలూరు రోడ్డులో చెన్నై క్రాస్ జంక్షన్ నుంచి ఆంధ్ర సరిహద్దు అయిన గొల్లమడుగు వరకు రోడ్డు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్తురు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌తో కలిసి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రహదారుల మరమ్మతులకు, వాటి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. చెన్నై జంక్షన్ నుంచి ఆంధ్ర సరిహద్దు అయిన గొల్లమడుగు వరకు 1.6 కిలోమీటర్ల మేర పాడైన రోడ్డును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టడానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.2.30 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గుడిపాల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎమ్మెల్యే సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, డీఈ దస్తగిరి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శివరాజ్, టీడీపీ నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మంచుతో మామిడికి దెబ్బ

గుడిపాల: గత కొద్దిరోజులుగా కురుస్తున్న పొగ మంచు ప్రభావంతో మామిడి పంటకు నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల పూత రాకపోవడం .. మరికొన్నిచోట్ల పూత, పిందెలు రాలిపోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉద్యానశాఖ అధికారులు స్పందించి పంటను కాపాడుకునే విధంగా అవగాహన కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

చిత్తూరు నియోజకవర్గంలో సుమారు 4 వేల హెక్టార్లలో మామిడిపంట సాగులో ఉంది. ఏటా డిసెంబర్, జనవరి నెలల్లో మామిడి తోటలకు పూత అధికంగా వస్తుంది. ఈ పూత వచ్చినప్పుడు వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయి. అయితే ప్రస్తుతం కురుస్తున్న అధిక మంచు వల్ల మామిడికి కోలుకోలేని దెబ్బ తగులుతోంది.


పొగమంచు కారణంగా పూత రాలిన మామిడి

ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న మామిడికి ఈ మంచు నష్టం కలిగిస్తోంది. ముఖ్యంగా తోటలను కౌలుకు తీసుకున్న రైతులు పంటపై ఆశలు వదిలేసుకుంటున్నారు. గతేడాది కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందని, ఈ ఏడాది అదే కొనసాగుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తాం:

మామిడి తోటలకు నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు పాటించే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేస్తాం. పొగమంచు అధికంగా ఉండడం వల్ల తేనెమంచు పురుగు ఆశిస్తుంది. ఇవి పిందెలు, కాడల రసాన్ని పీల్చుతాయి. మసిమంగు ఏర్పడుతుంది. దీని నివారణకు కాన్ఫిడార్ మందు 0.5 ఎంఎల్, సాఫ్ 2 గ్రాములు, ప్లానోఫిక్స్ 0.25 ఎంఎల్ లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.

– ప్రవీణ, ఉద్యానశాఖ అధికారి



వరినాట్లు వేస్తున్న మహిళలు

వరిసాగులో రైతన్నలు బిజీగా ఉన్నారు. పొలాల్లో మహిళా కూలీలు వరినాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. వ్యవసాయ బావులు, బోర్లలో నీళ్లు ఉన్న కొంతమంది రైతులు వరినాట్లు వేసేందుకు దుక్కులు సిద్ధం చేసుకున్నారు. మండలవ్యాప్తంగా దుక్కులు సిద్ధం చేసుకున్న పొలాల్లో విరివిగా వరినాట్లు వేస్తున్నారు.

–గుడిపాల

సా....గుతున్న కరెంట్ పనులు

చిత్తూరు నగరంలోని మురకంబట్టు ప్రాంతవాసులు తమ కాలనీలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో అవస్థలు పడుతున్నారు. ఈ లోఓల్టేజీ బాధ ఒక ప్రాంతానిదే కాదు.. ట్రాన్స్‌కో పాత అర్బన్ డివిజన్ పరిధిలోని అందరిదీ. దీంతో మెరుగైన విద్యుత్ సరఫరాకు గత పాలనలో అధికారులు నివేదిక సిద్ధం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్ పొడగింపు, స్తంభాల ఏర్పాటుకు రూ.1.26 కోట్లతో అంచనా వేశారు. ఇందుకు సంబంధించి శాఖాపరమైన అనుమతులు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో ఉన్న మెటీరియల్‌తో పనులు చేశారు. పలు ప్రాంతాల్లో మెటీరియల్స్ కొరత కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయి.

- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు
- వేధిస్తున్న లోఓల్టేజీ
- అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు అత్యవసరం
- ముందుకు సాగని విద్యుత్ అభివృద్ధి పనులు
- మరోవైపు మెటీరియల్స్ కొరత

చిత్తూరు కార్పొరేషన్: గతంలో నూతన విద్యుత్ సరీస్ తీసుకోవాలంటే అర కిలోవాట్‌కే అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం వాటిని 2 కిలోవాట్స్‌కు పొడిగించారు. కాలక్రమేణా సర్వీసుల సంఖ్యతో పాటు విద్యుత్ పరికరాల వాడకం పెరిగింది. ఫ్యాన్లు, ట్యూబలైట్లు, ఫ్రిడ్జ్, కూలర్, టీవీ, ఐరన్‌బాక్స్, మోటార్, వాషింగ్‌మెషీన్, మిక్సీలు దాదాపు ప్రతి ఒక్కరి ఇంట్లో ఉన్నాయి. ఏసీ, కంప్యూటర్, ఈ–బైక్‌ల వాడకం ప్రస్తుతం పెరుగుతున్నాయి. నివాస వీధుల్లో గృహావసరాలకు పెట్టిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి వచ్చే సరఫరా లోడ్ చాలడం లేదు. దీంతో పలు ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తుతోంది. ప్రధానంగా సమస్య ఉన్న ప్రాంతాలను సిబ్బంది గుర్తించారు. గత ప్రభుత్వంలో గుర్తించిన ప్రాంతాలతో పాటు మరికొన్ని ప్రాంతాలను అదనంగా కలిపి పనుల కోసం నివేదించారు.

వేధిస్తున్న మెటీరియల్ కొరత

డివిజన్ పరిధిలో రూ.1.26 కోట్లతో అభివృద్ధి పనులు చేయడానికి శాఖాపరంగా అనుమతులు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే .. ఉన్న మెటీరియల్‌తోనే పనులు పూర్తి చేశారు. ఇంక కేబుల్, కండక్టర్, ట్రాన్స్‌పార్మర్, ఎర్త్‌పైప్‌ల కొరత ఉండడంతో అవి వచ్చాక మిగిలిన పనులను చేయనున్నారు. నగరంలోని టీచర్స్‌కాలనీలో రూ.6.58 లక్షలతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్(డీటీఆర్), 1 స్తంభం, నలందనగర్‌లో రూ.15 లక్షలతో 150 కేవీ నుంచి 315 కేవీకు డీటీఆర్ సామర్థ్యం పెంపు, బాపూజీనగర్‌లో అదనంగా రూ.8.33 లక్షలతో 160 కేవీ డీటీఆర్, పగడమానువీధి, మిట్టూరు శివారులో రూ.13.80 లక్షలతో 100 కేవీ డీటీఆర్‌లు పెట్టనున్నారు. వీటితో పాటు వెంగళ్రావుకాలనీ, వెంకటేశ్వరకాలనీ, ఇరువారం, సుందర్‌నగర్, రోషినగర్, జీకేనగర్, గిరింపేట, రామ్‌నగర్‌కాలనీ శివారు, కాజూరు, తోటపాళ్యం, నీవానది సమీపం, మహాత్మనగర్, రంగాచారివీధి ప్రాంతాల్లో రూ.61 లక్షలతో 100 కేవీ నుంచి 160కు 13 డీటీఆర్‌ల సామర్థ్యం పెంచనున్నారు. వీటితో పాటు కేజీపల్లె, ఎం.అగ్రహారం, పూనేపల్లె, రెడ్డిగుంట, జీడీనెల్లూరులోని వేపంజేరి, కొత్తపల్లె, వేల్కూరు, పెనుమూరు, పాలసముద్రం, పూతలపట్టులో ఈజీ కేబుల్స్ మార్పు, అదనపు డీటీఆర్, సామర్థ్యం పెంపు, కరెంటు స్తంభాలు ఏర్పాటు పనులను రూ.22 లక్షలతో చేయనున్నారు. ఈ లెక్కన మొత్తం 15 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, 10 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, 70 స్తంభాలు, 61 కిలోమీటర్ల లైన్ ఏర్పాటుకు రూ.1.26 కోట్లు ఖర్చుచేయనున్నారు.


కొంగారెడ్డిపల్లెలో పెట్టిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్


నగరంలోని డీఐరోడ్డులో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ స్తంభం

త్వరలో పూర్తి చేస్తాం

డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్య ఉంది. దాని పరిష్కారం కోసం పనులు చేయిస్తున్నాం. ఇప్పటికే అధిక భాగం పనులను పూర్తి చేశాం. మెటీరియల్స్ త్వరలో రానున్నాయి. ఆలోపు మిగిలిన పనులను ప్రారంభించనున్నాం. దశలవారీగా పనులు త్వరలో పూర్తి చేయనున్నాం. ఈ పనులు పూర్తయితే సంబంధిత ప్రాంతాల్లో మెరుగైన సరఫరా వస్తుంది.

–ఇస్మాయిల్‌అహ్మద్, ఎస్‌ఈ ట్రాన్స్‌కో

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తవణంపల్లె ఎంపీడీఓ రెడ్డిబాబు, తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని రావాలని కోరారు. సమస్యల పరిష్కారంలో భాగంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.